# మా టెల్గు టల్లికీ...

"ఆమ్మాయికేం రాస్తారు జవాబూ" అని మళ్ళీ అంతలోనే ఏం సందేహం వచ్చిందో కానీ, "ఇంతకీ ఈ ఉత్తరం చదివారా అసలూ?" ఇడ్లీ పెడుతున్నదేమో, ఆ మినపచోవి గరిటెను ఆడించుకుంటూ, ముక్కు మీదకుజారిపోతున్న కళ్ళజోడును ఎండంచేత్తో పైకి త్రోసుకుంటూ కాళికలాగే వచ్చింది మహంకాళి.

"ఊఁ..... చ... చదివానోయ్ నిన్ననగా ఇచ్చిన ఉత్తరం చదవకుండా... ఉంటానా?" అన్నాను చదవలేదన్న విషయం బైటపెడితే దెప్పులు, సాధింపులూ తప్పవని.

"అయితే ఏం రాసిందండీ.... చెప్పండీ?"

"అదేనోయ్.... కాన్వెంట్లో సీటు గురించీ.." నాన్నాను.

"అదిసరే... ఈ ఉత్తరంలో ఏం రాసిందీ అంట?"

"అబ్బబ్బ... ఓపక్క ఆఫీసు విషయాలూ మరోపక్క నీ ఆరోగ్యం సంగతీ... మరీ మధ్యమధ్యలో ఇంకా.... అనేకం... ఏం గుర్తుంటాయ్. ఇద్గో చదువుతావిను" అని ఉత్తరం తీశాను. "ఊఁ... మహారాజశ్రీ నాన్నగారికి నమస్కరిస్తా మీ కుమార్తె రాయునది. ఇక్కడ అంతా క్షేమం అమ్మామీరూ బావున్నారని తలుస్తున్నాను." అని చదువుతుండగా "సర్లెండి.... నేం చదివాను... ఈరోజు యినావెళ్ళి ఏ కాన్వెంటు బావుంటుందోకనుక్కోండి. అదీపాటికి పదిసార్లన్నా ఫోన్ చేసుంటుంది....." అంది మహంకాళి.

అయితే మా ఆవిడపేరే మహంకాళి కానీ... మానసూ, మటాకూడామెత్తనే. "అది కాదోయ్.... ఆమధ్యనల్లానడుం నొప్పిఅన్నావు. దానికి మందువాడితే.... ఇప్పుడు ముణుకులు ఒకటే నలుపూ... పోటూ అంటున్నావు. ఇంతకాలం గానుగెద్దులాగా పనిచేశావ్. ఎవరిదారిన వాళ్ళని సాగ నంపాం. పురుళ్ళూ.... పుణ్యాలూ అన్నీఅయాయి!

ఇప్పుడు మళ్ళీ వాళ్ళ పిల్లల చదువులూ అవీ అంటే ఎలాగోయ్? అందులోనూ ఆడపిల్లాయే..... ఇక్కడజేర్పిస్తే దానికి జెడలు వెయ్యాలి. వనిమనిషి సరిగారాదు. దానిబట్టలుతకాలి. ఈ కాలపు ఆడపిల్లలెవరూ... ఇక్కడవుల్ల అక్కడ తీసిపెట్టరు. అసలే అల్లుడు ముక్కోపి. ఏదానికేదాయినా మాట విసిరేస్తాడు. అందుకనే అక్కడే...." అని నామాట నానోట్లోని ఉంది. కాళి "అదిగో... అక్కడే నాకు చిరాకు. అల్లుడే రాయమన్నాట్ట. మీరుత్తరం చదివితే ఇలా అనరు. ఇప్పుడల్లుళ్ళో బాగా మార్పొచ్చిందట.

వాళ్ళున్న దగ్గర ఒడియవాతవ్వ తెలుగస్సలు చెప్పరట. ఆంధ్రా చదువులు



బాగుంటాయట. ఇప్పుడు మనం కాదంటే అల్లుడికే కాదు..... అమ్మాయికీ కోపం వస్తుంది! అందుకే ఏ కాన్వెంటు మంచిదో భోగట్టాచేసి అమ్మాయికి వివరంగా ఉత్తరం రాయండి" అంది.

"అంతేనంటావా! తప్పదా" అని అడిగాను.

"అంతే!" అంది మహంకాళి గరిట తిప్పుతూ.

"సరే. నీ ఖర్మ' వినిపించకుండా గొణుక్కున్నాను. ఆఫీసులో అడగ్గా 'ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ అవాడమీ' అనేదొకటి, విశ్వ సారస్వతీ మహా విద్యాలయం' అనే ఈ రెండింట్లో దేంట్లో చేర్పించినా మరిపిల్లని తిరిగి చూడక్కర్లేదన్నారు మా ఆఫీసువాళ్ళు. "అంటే..... వాళ్ళే పిల్లకి పెళ్ళిచేసే అత్తారింటికి పంపుతారాఏం?" అన్నాన్నేను.

"అబ్బ... అదికాదండీ..... టెన్త్‌క్లాస్‌లో అయిదొందల మార్కులు దాటే వస్తాయి" అన్నారు.

"అదికాదండీ.... మా అమ్మాయి ఒరిస్సాలో ఉంటోంది. అక్కడ చదువుబాగానేఉంటోంది. కానైతే తెలుగు బోధించరు. పైగా వాళ్ళ భాషంటే వాళ్ళకెంతో ఇష్టంట. మా పిల్లకీ తెలుగు మీద అభిమానం ఎక్కువై ఇక్కడ చేర్పించమంటోంది. అలాగనీ తెలుగు మీడియం మాత్రం వనికి రాదంటోంది. ఫస్టులాంగ్వేజ్ తెలుగుండాలి... మీడియం మాత్రం ఇంగ్లీష్ ఉండాలి. ఏం చేస్తాం? వాళ్ళిష్టం!" అన్నాను.

ఒక పూట లీవుపెట్టి ఈ 'ఇంటర్నేషనల్ కాన్వెంటుకే వెళ్ళాను. నేనాశ్చర్యపోయాను. అది కాన్వెంట్‌గా కనిపించలేదు. తాజ్‌మహలుగా కళకళలాడిపోతోంది. లోపలి కెళ్ళగానే గేటు దగ్గరున్న గార్డులాంటి వ్యక్తి శాల్యూట్ కొట్టి

"ఏం కావాలి సార్?" అన్నాను వినయంగా.

"సీటు కావాలి!" అన్నాను.

"ఇప్పుడేంటి సార్. సంవత్సరం చివరికొచ్చేస్తోంటే"

"మళ్ళీ సంవత్సరానికి...." అన్నాను.

"అలాగా..... తిన్నగా వెళ్ళండి.... ఎడంవేపు నుంచి వెళ్తే మెట్లు కనిపిస్తాయి. మెట్లకు కుడిపక్కగా తిరిగితే ప్రిన్సిపాలు గది ఉంటుంది. అక్కడికెళ్ళి అడగండి" అన్నాడు.

ప్రిన్సిపాలు గదిలో కెళ్ళాను. ఆయన వివరాలడిగారు. చెప్పాను. కొన్నేళ్ల చరిత్ర చూపెట్టారు. అన్నీ ఫస్టు క్లాసులే. ఎవరికీ ఐదొందలకు తక్కువలేవు మార్కులు.

"అవును సార్! అలాగే. కానీ అమ్మాయికి టెస్ట్ పెడతాం. అప్లికేషన్ వంద రూపాలయులు. వేసవి సెలవల్లో పదివేలు కట్టాలి. తక్కిన పదీ అక్టోబరులో కట్టాలి!" 'ఇరవైవేలా? ఎనిమిదిలో ప్రవేశానికి' అనబోయి గొంతుకెండి.... నాలుక తడారి మాటరాలేదు. 'ఇక్కడంత ఫీజుంటుదని అనుకోలేదు. సరే. మళ్ళీ వస్తా' ననిలేచాను. వరండాలోంచి వచ్చేస్తోంటే ఓ మాస్టారు రామాయణంలో 'ఊర్మిళా దేవి నిద్ర' గురించి చెప్తున్నారు. పంచె కట్టుకున్నారు. కల్లీ చొక్కా వేసుకున్నారు. భుజం మీద కండువా, నుదుట అడ్డనామాలు.... మధ్య గంధపు బొట్టు... దాన్లోసిందూరం ముమ్మూర్తులా తెలుగు పండితునిలాగే కనిపిస్తున్నాడు. ఎలా చెప్తాడో విందామని ఒకడుగు తగ్గాను, వెళిపోతున్న వాడినల్లా.

"ఒరే కుర్రాల్లూ! ఊర్మిలాదేవి నిద్ర గూర్చి చెప్పుకునే ముందు ఆయమ్మ గూర్చి తెల్సుకోవాలి కదర్రా!" అన్నాడు. తెలుసుకోవాలన్నారు పిల్లకాయలు. 'గుడ్డర్రా' అని మొదలుపెట్టాడు.

"ఆయమ్మెవులూ?" అన్నాడు.

"నచ్చమనుడు బార్జ" అలాగని కినుక్కున నవ్వుకుని నోటికడ్డంగా చేతులుంచుకున్నారు పిల్లలు.

"మరి నచ్చనుడెవులూ?" అనే సరికి "ఊర్మిలమ్మ పెనిమిటి" అన్నారు పిల్లలందరూ కోరస్‌గా.

''ఈలిద్దరికీ రావులోరికి సమ్మందమేటి?'' అన్నాడు.

ఓకుర్రాడు లేచి "లక్ష్మణుడు రాముడు తమ్ముడు. ఊర్మిళ రాముని మరదలు'' అన్నాడు.

"ఎరీ గుడ్డురా అబ్బాయి. మీకందరికీ ఈ కతతెలుసుకదా!'' అన్నాడాయన.

"మాకు తెలీదు. చెప్పండి" అని పిల్లలు గోలచేశారు.

''నరే నర్రా. రామాయనం శానా గొప్పకత. నాను సెపితేనమ్మరేమోగానీ... పెపంచకంలో ఇంత గొప్పకతని ఎవులూ రాయనేపోన్రు. దీంట్లోని మర్మాలు సెపుతానినండి. రామాయనంలో ఎలాటోల్లకి మంచి పేరొత్తదో ఎలా నడవకపోతే సెడ్డ పేరొత్తదో శానాబాగా రాసినారు వోల్మీకి కవిగోరు.

"కొడుకు లెలాగుండాలంటే.... రాములోరునాగా తండ్రి మాట ఇనాలనడానికి రాములోరు కనిపిత్తారు.

అన్నదమ్మిలెలానడుసుకోవాలో అర్థం సేసుకోవాలంటే రామాయనం సదవాల. రామ నచ్చన బరత సెత్తురుగ్నుల్నాగా ఉండాల, ఆలూమగలూ ఎలాగుండాలంటే రాములోరూ, సీతమ్మల్నాగా ఊర్మిలమ్మా, నచ్చనయ్యల్నాగా ఉండాలని గైంచాల!

మొగుల్లు తప్పుదోవలో నడుత్తుంతే మండోదరమ్మ నాగా దార్లోనెట్టాల. తప్పు దోవల్నపడిసినెవుల్నైనా ఎదిరించాలా అనడానికి 'ఇబీసనులోరు' మచ్చుతునక.

ఇలపింటిమంచి మంచి మనుసులు రామ కతలోనే ఉన్నారు. నచ్చయ్య అన్నగారి సేవసెయ్యనానికెల్తే.... ఊర్మిలమ్మ బయలెల్లినాది. ఆయనొద్దంటే వొరాన్ని కోరుకున్నదాయమ్మ. ఇంత గొప్ప కతర్రా రామాయం'' అని చెప్పాడాయన.

నాకు బుర్ర తిరగింది ఆయన భాషను చూసి, మాండలిక భాష రచనలో వస్తున్నట్లే విద్యాబోధనలో కూడావస్తోంది?' అనుకుంటున్నంతలో బెల్లయింది.

తీరా నాకు తెలిసిందేమంటే అయిన అసలు తెలుగు మాష్టారే కాదట! తెలుగు చెప్పడానికి ఏవ్వరూ లేకపోతే తెలుగు బాగా తెలిసిన ఓ పల్లెటూరి అసామీని అందాక తెచ్చి ఉంచారట. తెలుగుకి ఎంత దౌర్భాగ్యం దాపరించింది?!

మరోనిమిషం అక్కడుండకుండా 'విశ్వసారస్వతీ' మహా విద్యాలయం'కి దారితీశాను. పాఠశాల వాతావరణం, నిర్వాహణా చాలా బాగుంది. విశాలమయిన అటస్థలం పూల మొక్కలుతో భరతమాత ఆకారంతో చూడముచ్చటేసింది.

ముందు 'తెలుగు పాఠం' వినాలి అనే కోరిక నన్ను దొలిచి వెయ్యటంతో వరండాలో అటూ, ఇటూ పచార్లు చేశారు. 'తెలుగు కోయిల ఓ చోట కూతకూస్తోంది.

"పిల్లలూ కోర్సు పూర్తయింది. ఇవాళ రివిజన్ చేస్తానన్నాను. చదివారా?" అడిగింది.

''చదివామండీ'' కోరస్‌గా అన్నారు పిల్లలు.

"సరే శ్రీనూ నిలబడు. 'శ్రీ కంఠునిన్' పాడుదున్. అని ఉంది కదా! 'శ్రీ కంఠుడు' అంటే ఏంట్రా?" అని అడిగిందామె.

"శివుడండీ" చెప్పాడు వాడు.

"గుడ్" మెచ్చుకుందామె.

"మేడం శ్రీ అంటే లక్ష్మీదేవి కదండీ.... 'లక్ష్మీ దేవి' కంఠమందుకలవాడు విష్ణుమూర్తి కదండీ. మరి శివుడెలా అయ్యాడండీ....."

"భగవంతుడొక్కడే. 'శివుకేశవులు' వేరు వేరుకాదు 'ఈశ్వరుడు' అన్నవదం భగవంతునికీ వాడతాం. శివునికీ వాడతాం కదా! అందునుంచి ఇక్కడ సందర్భాన్ని బట్టి అర్థంచేప్పుకోవాలి" అందామె.

"అది కాదు మేడం. 'శ్రీ' అంటే విషం కదా, విషం కంఠంలో కలవాడు శివుడు కదా!"

అంటే పాల సముద్రమథనం జరిగినప్పుడు శివుడు హాలాహాన్ని మింగాడు లోకరక్షణకోసం. అందుకే అతనికి ఆ పేరొచ్చిందని మా డాడీ చెప్పారు మేడం!"

అని ఓ అమ్మాయి అనగానే ఇంకో అబ్బాయి చటుక్కున లేచి-

"మేడం విషం గొంతులోకెళ్తే ఎవరైనా చచ్చిపోతారు కదా మేడం" అని అడిగేసరికి మేడం "మనపురాణకాలంలో చంద్రుణ్ణి సూర్యుణ్ణి దేవుళ్ళనుకున్నారు.

చంద్రుడి మీద కవులెన్నో కల్పనలు చేసి రకరకాలయిన కథలల్లారు.

కాలక్రమంలో అవన్నీ కథలేకాని నిజాలు కావని తేలిపోయాయా? కళ్యాణ్ చెప్పింది కరెక్టు. కాలం మారింది ఇప్పుడు శాస్త్రీయ దృక్పథంతో పాఠాలు చెప్పాలి విషం గొంతులో ఉంచుకోటమేంటి నా బొంద? అది తప్పు, కూర్చో!" అని అందామె.

'హతోస్మి!' అనుకొని వచ్చేశాను.

ఆమర్నాడాదివారం. ఆ రోజు మాతృభాషా దినం, ఉదయం పదిగంటలకు ఓ కళ్యాణమండపంలో సభ ఉంది.

నగర ప్రముఖులంతా హాజరవుతున్నారని న్యూ 'దినపత్రిక' ద్వారా వచ్చిన కరపత్రం తెలియచేస్తే - భాషాభిమానంతో వెళ్ళాను. సుమారు నూరుమంది వచ్చారు.

సభాధ్యక్షులు ప్రముఖ పారిశ్రామికవేత్త. జి.జి.రాయ్. (ఆంగ్లో ఇండియన్ అనుకునేరు, నేనూ అలాగే పొరపడ్డాను. అతని పూర్తి పేరు గవరగురాయ) ఆయన సభను ప్రారంభిస్తూ (ఆంగ్లంలోనే) "ప్రేయర్. మాటెల్గు టల్లికీ మళ్ళెపూధండా లిరిక్ బై సంకరన్-బడి-సుందర -ఆచారి" అన్నాడు.

ఎవరూ రాలేదు. "హూ ఈజ్ సంకరన్ - బడి-సుందర ఆచారీ? కమాన్" అనగానే సభానిర్వాహకుడైన ఓ కుర్రాడొచ్చి-

"సార్! ఈపాట రచన శంకరంబాడి సందరాచారి. ఆయనిప్పుడు లేరు. పిల్లలా గీతాన్నాలపిస్తారు" అని అంటూ

"క్షమించండి. రాయ్‌గారి సౌలభ్యం కోసం ప్రోగ్రామ్‌లో తెలుగుపదాలని ఇంగ్లీషులో టైపుచెయ్యటం జరిగింది" అని సభాసదులకు విన్నవించుకున్నాడు.

ప్రార్థన జరిగింది.

అధ్యక్షుని తొలి పలుకులుగా ఇంగ్లీషులో ఆయన చెప్పిన సారాంశం.

"నేను పచ్చి పదహారణాల ఆంధ్రుణ్ణే. కానీ చిన్నప్పట్నించీ ఇంగ్లీష్‌మీడియం చదువులు బిజినెస్ వల్లా.... తెల్గు మార్చేపోయాను.

నాకూ తెలియకడుగుతాను, అసలు తెలుగులో ఇన్ని అక్షరాలెందుకూ?

ఇంగ్లీషు అక్షరాలు లాగే ఇరవై యారుకి తగ్గించేస్తే ఎంతహాయిగా ఉంటుందో.... మన తెలుగు వాళ్ళకి ఛాదస్తాలెక్కువలాగే అక్షరాలు కూడా ఎక్కువే" అనేసరికి వెనకనుంచి నిర్వాహకుడు చప్పట్లు కొట్టమన గానే సభ చప్పట్లుతో మార్మోగింది.

నా ప్రక్కనున్న ఓ కుర్రాడు మండిపోతున్నాడు "వీళ్ళు భాషను ఖూనీచె య్యడానికా సభను పెట్టారు" అని స్పీడుగా వెళ్ళి.... రెండు నిమిషాలు టైమ్ ఇమ్మన్నాడు. నిర్వాహకులు అంగీకరించలేదు. ముఖ్యఅతిథి 'అయ్యేయెస్' అధికారి తమిళవ్యక్తి అయినా ఆకుర్రాడికి అవకాశం ఇవ్వమన్నాడు. లాస్ట్‌లో ఇస్తామని- ఈ ప్రాంతానికి చెందిన ఓ యువకవి, వర్ధమానకవి తనకవితాసుమాలతో మిమ్మల్ని అలరిస్తాడనగానే ఓ కల్లీ లాల్చీ పైజమాతో మోడరన్ కవిగానూ,చంకలో వేలాడుతున్న బేగ్ వల్ల విప్లవకారునిగానూ ఫోజిస్తూ అందరికీ నమస్కరించి కవిత మొదలెట్టాడు.

"ఆనందంతో 'కల్లు' తెరిశాను. సీకటి... సీకటే సీకటి! ఒల్లు జలదరించింది. భయంతో 'కల్లు' మూసుకున్నాను. ఆశ్చెర్యం! అంతా

ఎన్నెలే. ఎన్నెల!... ఏటీ సిత్రం.

పెపంచికం మాయలదుప్పటిసాటున మగ్గిపోతుంది. రాసకీయం 'కుల్లి కుల్లి' డ్రైనేజిల్లేక డేంజరైతాంది.

అందుకే నేనంటాను (గట్టిగా రెండవసారి) మన 'సంస్కృతి'ని పాతి పెట్టాలని! అహింస పరదర్మానికి నూకలు సెల్లిపోనాయి. కత్తికి పదునుబెట్టండి. అంత వరకూ 'కల్లు' తెరవకండి. తెరిసారో... మీ 'కల్ల'ని లోకం కాకులు పొడస్తాయి. (రెండవ సారి) హాలంతా చప్పట్లు, కవిగారి కవిత పూర్తయింది.

యువకుడు నిప్పులు చెరగుతూ వేదికెక్కాడు.

''అందరికీ నమస్కారం!'' తెలుగు మాధుర్యం - తెలుగు భాష ప్రాథమిక జ్ఞానంలేని పెద్దలతో సభనడిపిస్తోన్న నిర్వాహకులకు.... అక్షరాలను స్పష్టంగా ఉచ్చరించలేని వ్యక్తి కవిత్వం చెప్పటతానికి సాహించటం. అలాంటి కవితలకత్తులతో మమ్మల్ని గాయపరిచి జీవచ్ఛవాలుగా చేసిన పెద్దలకూ నమస్కారం. బమ్మెర పోతన్నగారు 'భాగవతాన్ని' రాజులకివ్వాలన్న ఆలోచన రాగానే కాటుక కన్నీరుతో ఏడ్చిన 'సరస్వతి'ని ఇంతగా 'మానభంగం' చెయ్యటం మర్యాదకాదని... అందుకు టీ.వీ.యాంకర్లు నరిపోతారని సభాముఖంగా అధికార భాషాసంఘానికి విన్నవిస్తూ నిర్వాహకులకు తప్పయితే నన్ను క్షమించమని కోరుతూ సెలవు తీసుకొంటున్నాను'' అని దిగిపోతుండగా సబ్‌కలెక్టరు గారు పిలిచి, కరచాలనంచేసి అతని ముందున్న పుష్పగుచ్ఛం, ఆపిలు పండూ, ఇచ్చారు.

సభ చప్పట్లతో దద్దరిల్లిపోయింది. ఆ కుర్రాడి మాటలతో జనం సగంమంది లేచారు. నేనూ లేచాను. ఇంటికెళ్లి భోం చేసి పడుకొన్నాను. లేచేసరికి శ్రీమతి టీ.వీ.లో మునిగింది. టీ.వీ.లో యాంకరు ముద్దమందారంలా ఉంది. పాలకోవాలా ఉంది సిమ్లా ఆపిలు పండులా ఉంది. పదిహేను సంవత్సరాలుంటాయేమెవో! చిలక పలుకులు పలుకుతోంది "మీ అందరికీ షుభాకాంక్సలు. ఈ రోజు తమచిన్నారి 'షైలజా' పుట్టినరోజు ఖోషం ఒక మంచి పాటని కోరుతూ షైలజా 'అమ్మానాన్నా' అమమ్మ తాతయ్యా' పిన్నిబాబాయి ఇంకా షైలజా కుటుంభ సభ్యులు కోరుతున్నారు. ఓ.కే. నండీ..... మీ అంరి కోరిక మేరకు హేపీ బర్త్‌డే షైలజా!" అని పాట వేసింది.

కరెంటుపోయింది. 'హమ్మయ్యా' అనుకున్నాను.

వెనకటికో నటుడు పద్యాలు పాడుతూ అనవసరమయిన చోట వత్తులు పెడుతోంటే - మరో పెద్దనటుడు వెళ్ళి పక్కకనే డబ్బాపెట్ట - మీ 'వత్తులు' దీన్లో వేసెయ్యండి అన్నాట్ట. నాకా విషయం గుర్తొచ్చింది.

ఏయే పదాలను కలిపి చదవాలో, ఎక్కడగేపివ్వాలో తెలీని ఏంకర్నిచూసి జాలేసింది. మా ఆవిడ టీ పెట్టడానికెళ్ళే సరికి కరెంటొచ్చింది. టీ.వి ఆపబోతూ సిటీకేబుల్ ఛానల్ అన్చేశాను. పొరపాటున, మరో పదిహేనేళ్ళ యువతి, మాతృభాషాదినం సందర్భంగా తెలుగు క్విజ్ నిర్వహిస్తూ - "జాషువ కవి రాసిన ఏ పుస్తకానికి కేంద్ర సాహిత్య ఆకాడమీ అవార్డొచ్చింది?" అనగానే - క్విజ్‌లో పాల్గొన్న ఓ కుర్రాడు "మేడమ్! తెలుగు 'క్విజ్'లో ఆంగ్లకవుల గురించి అడగటంబాగోలేదు" అనగానే " సారీ, మరో ప్రశ్న వేస్తా'' నంది. నాకు తెలుగు వాళ్ళ దౌర్భాగ్యానికి నవ్వాలో, ఏడవాలో తెలీలేదు.

ఇంతలో ఫోనొచ్చింది.

"నాన్నా! ఎంక్వయిరీ చేశారా?'' అని మాపాప ఫోన్ చేసింది. నాకేం చెప్పాలో తెలీక

''అమ్మా! ఇక్కడ చదివిస్తే తెలుగు నేర్చుకోటం సంగతి ఎలా ఉన్నా మంచి టీ.వీ.యాంకర్ మాత్రం కాగలదని చెప్పగలనమ్మా!'' అన్నాను.

అమ్మాయికి నా బాషలో శ్లేష అర్థం కాలేదు.

''సరే. మీ అల్లుడు గారు వస్తారు. జాయిన్ చెయ్యండి మంచి స్కూల్లో'' అంది.